సొంతింటి కల నెరవేరేనా ..?

నత్తనడకన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలు

- 8 ఏళ్లుగా కొనసాగుతున్న నిర్మాణాలు
- ప్రజాపాలనలో సైతం దరఖాస్తుల వెల్లువ
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు



జవహర్‌నగర్‌లో డబుల్‌బెడ్రూమ్‌లు

జవహర్‌నగర్: పేదోడి ఇంటి కల కలగానే మిగిలిపోయేలా ఉంది. ప్రతి ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో రాజకీయ నాయకులు పేదలందరికీ ఉచితంగా ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి ఆ తర్వాత కాలం గడుపుతూ వెళ్లిపోతున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రజలు డబుల్‌బెడ్రూమ్‌లు ఎప్పుడిస్తారా.. అని ఆశగా ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల గత ప్రభుత్వం లబ్ధిదారులకు ఎన్నికలకు ముందు హడావిడిగా ఇళ్ల పంపిణీ చేసినా.. వాటిలో సౌకర్యాలు లేక విలవిలలాడుతున్నారు. కొన్నిచోట్ల డబుల్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

◆ జవహర్‌నగర్‌లో సర్వేనెం. 829, 775, 776, 784, 720, 721, 722, 723, 725లలో దాదాపు 35 ఎకరాలలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు మొదలై దాదాపు ఏడేళ్లపైనే అవుతుంది. ప్రస్తుతం 20 ఎకరాలలో దాదాపు 1625 డబుల్ బెడ్రూమ్ నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 15 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా..

నియోజకవర్గంలోని డబుల్‌బెడ్రూమ్ దుస్థితి మరీ అధ్వానంగా తయారైంది. కిష్టాపూర్‌లో 80, సోమారంలో 30, జవహర్‌నగర్‌లో 1620, ఘట్‌కేసర్‌లో 50, కీసరలో 48, శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో 100 డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కట్టినా వాటిని లబ్ధిదారులకు కేటాయించకుండా నిరుపయోగంగా మారాయి.

ఇళ్లు నేటికీ పూర్తి కాలేదు..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లు పూర్తికావాలంటే మరో ఏడాది పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరగా పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

◆ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్‌బెడ్రూమ్‌లు నిరుపయోగంగా మారడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. కొన్నిచోట్ల తలుపులు, కిటికీలు ధ్వంసం చేశారు. మరి కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి.

◆ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక చేశారు. ఇంటిస్థలం ఉండి ఇళ్లు కట్టుకునేవారికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థికసాయం అందించనుంది. దీంతో నియోజకవర్గంలో వందలాది లబ్ధిదారులు ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం అధికారులు లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఉన్నారు. వాటిని అన్ని విధాల పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

స్థానికులకే ప్రాధాన్యమివ్వాలి..



జవహర్‌నగర్‌లో డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల పనులు మొదలై ఏడేళ్లు గడుస్తుంది. కేవలం ఎన్నిలొచ్చినప్పుడు మాత్రమే పేదలకు మాయమాటలు చెప్పి కాలం వెల్లదీస్తున్నారు. జవహర్‌నగర్‌లో దాదాపు వందల కుటుంబాలు ఇళ్లులేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– మేకల కావ్య, జవహర్‌నగర్ మాజీ మేయర్

దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడిచాయి.



రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఏడేళ్ల క్రితం చేసుకున్నాం. జవహర్‌నగర్‌లో 15 ఏళ్లుగా నిత్యం కూలీపనులు చేసుకుని బతుకుతున్నాం. మాకు వచ్చిన డబ్బులన్నీ ఇంటి అద్దెలకే సరిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి.

– యాలాల సునీత, జవహర్‌నగర్

అద్దె చెల్లించలేకపోతున్నాం..



ఎన్నికల సమయంలో ఇళ్లు లేని వారందరికీ డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కట్టిస్తామన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయలేదు. ఇప్పటికి అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నాం. నిరుపేదలను ప్రభుత్వం గుర్తించి ఇళ్లు ఇవ్వాలి.

– భాగ్యలక్ష్మి, బాలాజీనగర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మత్తుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేడ్చల్ పట్టణం, అత్వెల్లి, బాలాజీనగర్, మెట్రో లైనర్, కంట్రీక్లబ్ ప్రాంతాలతో పాటు మండలంలోని ఎల్లంపేట్, సోమారం, డబిల్‌పూర్, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి

కీసర: కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు తమ వరిధాన్యాన్ని ప్రాథమిక సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని ఆయన సూచించారు. సొసైటీ వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు, కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులున్నారు.

అసభ్యకర ఫొటోలు తీశారని విద్యార్థినుల నిరసన

అవాస్తవమన్న కళాశాల ప్రిన్సిపాల్

ఘట్‌కేసర్: అవుషాపూర్ వీబీఐటీ కళాశాల అమ్మాయిల అసభ్యకరమైన ఫొటోలు తీసి ఇతర సిబ్బందికి పంపించారని ఆరోపిస్తూ.. ఆ కళాశాల గేటు ఎదుట విద్యార్థులు శుక్రవారం నిరసన చేపట్టారు. కాగా గురువారం హాస్టల్ స్నాక్స్‌లో పురుగులు వచ్చాయని ఆరోపిస్తూ.. విద్యార్థులు వార్డెన్‌ను నిలదీయగా నిరసన తెలుపుతున్న వారి ఫొటోలు తీసి చీఫ్ వార్డెన్‌కు పంపింది. తిరిగి గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఉదయం తీసిన నిరసన ఫొటోలు, వీడియోలు గల ఫోన్‌కావాలని విద్యార్థులు పట్టుబట్టడంతో చీఫ్ వార్డెన్ ఫోన్‌ను తెప్పించి పరిశీలించగా అందులో అమ్మాయిలు అసభ్యకరమైన ఫొటోలు లేవని వారితో మాట్లాడి సమస్యను ముగించారు. అసభ్యకరమైన ఫొటోలపై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. శుక్రవారం మధ్యాహ్నం ఉదయం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కళాశాల లోపలికి వచ్చి విద్యార్థులను రెచ్చగొట్టి ఆందోళన చేయించి విధ్వంసం చేయించారన్నారు. రాజకీయ దురుద్దేశంతో కళాశాల పేరు అప్రతిష్టపాలు చేయాలని గొడవను సృష్టించారని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



ఉపేందర్‌రెడ్డి (ఫైల్)

జవహర్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్‌లో నివసించే ఉపేందర్‌రెడ్డి (25) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. కాగా తల్లి ఉమతో కలిసి ఉంటున్నారు. ఇటీవల నూతన ఇంటి నిర్మాణానికి రూ.18 లక్షల వరకు అప్పులయ్యాయని, అప్పు, వడ్డీలు కట్టలేక బాధపడేవాడు. ఈనెల 24న కుటుంబసభ్యులు నిద్రపోవడంతో ఉపేందర్ తన బెడ్రూమ్ నుంచి బయటకు వచ్చి పురుగుల మందు తాగానని తల్లికి చెప్పాడు. వెంటనే కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు 108సాయంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పుల బాధతోనే కుమారుడు పురుగుల మందు తాగాడని, తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లారెడ్డి కళాశాలలో ప్రీ-ప్లేస్‌మెంట్ టాక్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డీబీఎస్ టెక్నాలజీస్ ప్రీ-ప్లేస్‌మెంట్ టాక్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంటర్‌ప్రైజ్ డేటా లీడర్ విజయ కడియాలా ఆధునిక బ్యాంకింగ్‌లో డేటా పరివర్తన పాత్రపై మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక రంగంలో ముందుకు సాగడానికి డీబీఎస్ ఆవిష్కరణ, విశ్లేషణలను ఎలా ప్రభావితం చేస్తుందనే విషయంపై డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడం ప్రాముఖ్యతను వివరించారు. అప్రెంటిస్‌షిప్ టాలెంట్ అక్విజిషన్ లీడ్ శాంటోమోమా భరద్వాజ్ విద్యార్థినులకు అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై అవగాహన కల్పించారు. దీపిక బండి, రోహిత్‌రాజ్, స్పందన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా చీర్యాల బ్రహ్మోత్సవాలు



ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆశీర్వచనం చేస్తున్న వేద పండితులు

కీసర: భక్తుల కొంగుబంగారంగా పేరొందిన చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో సప్తదశ (17)వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం దేవాలయం సన్నిధిలో స్వామివారికి పంచామృత నవకళశాభిషేకం, విశ్వక్సేనపూజ, రక్షాబంధనం, అఖండ జ్యోతిస్థాపన, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, సుదర్శన నారసింహ యాగం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి స్వామివారి సేవలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. మాజీ ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కవిత, దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్, చీర్యాల మాజీ సర్పంచ్ అనితాశ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు తదితరులున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

నేడు స్వామివారి కల్యాణోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం 10 గంటలకు యాదాద్రి ప్రధానార్చకులు నల్లందిగులు నృసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి తిరుకల్యాణోత్సవం, ఉదయం, సాయంత్రం సుదర్శన నారసింహహోమం నిర్వహిస్తారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాశాఖ మేనేజర్ సుగుణతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని తడి, తాలు లేకుండా ఆరబెట్టి తూర్పారబట్టి కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమచేస్తామన్నారు. అధికారులు సమష్టిగా పనిచేసి జిల్లా, ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలు విషయంలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ రజని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పహల్గాంలో ఉగ్రదాడి అమానుషం

కేజీఆర్ కళాశాల ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు

కీసర: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తీవ్ర అమానుషమని కేజీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీ.రమణారావు అన్నారు. శుక్రవారం కళాశాలలో ఉగ్రదాడిని నిరసిస్తూ.. మృతిచెందిన యాత్రికులకు నివాళులర్పించి సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో అందమైన పర్యాటక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు చాలా దురదృష్టకరమన్నారు. దాడిలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇలాంటి సమయంలో దేశ ప్రజలందరూ ఒక్కటై బాధిత కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. ప్రొఫెసర్లు విజయలక్ష్మి, విజయకుమార్, రంగేశ్వర్, సునీత, డాక్టర్ శిల్పికా, స్రవంతి, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో టీఈజేఏసీ ఆధ్వర్యంలో..

సాక్షి,సిటీబ్యూరో: పహల్గాంలో అమాయక పర్యాటకులపై జరిగిన హేయమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ.. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఈజేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులు, ఉద్యోగులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడిలో అమాయక పర్యాటకుల ప్రాణాలు పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలువాలన్నారు. ఇలాంటి హేయమైన హింసాచర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిందితులపై కఠినచర్యలు తీసుకుని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీ కానున్న జెడ్పీ, మండల పరిషత్ భవనాలు

తీరనున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాల సమస్య



మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయం

మేడ్చల్: నియోజకవర్గంలోని 6 గ్రామాలు కొన్ని సమీప మున్సిపాలిటీలు, మరికొన్ని గ్రామాలతో నూతనంగా 4 మున్సిపాలిటీలుగా మారడంతో మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాల కొరత తీరనుంది.

◆ జిల్లాలో గ్రామాలు లేకపోవడంతో నియోజకవర్గం, జిల్లాలో జెడ్పీటీసీలు, ఎంపీటీలు లేకుండా పోయారు. గ్రామాలన్నీ మున్సిపాలిటీలుగా మారడంతో పంచాయతీరాజ్ పాలనకు మేడ్చల్‌లో అవకాశం లేకుండా పోయింది. దీంతో నూతన మున్సిపాలిటీల ఏర్పాటు ప్రకటన మరుసటి రోజు నుంచి మండల, జిల్లా పరిషత్ భవనాలు ఖాళీ కావాల్సిందే.

ఇతర కార్యాలయాలకు అవకాశం..

మేడ్చల్‌లో జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ మేడ్చల్‌లో జాతీయ రహదారిపై ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌లో అద్దెకు సాగుతున్నాయి. ఆ భవనంలో రెండో అంతస్తులో ఉండటం, పైకి వెళ్లేందుకు ఇనుప రేలింగ్ మెట్లు, సరైన సదుపాయాలు లేకపోవడంతో మహిళలు, వృద్ధులు అనే ఇబ్బందులు పడుతున్నారు.

◆ పార్కింగ్ వసతి లేకపోవడంతో కార్యాలయాలకు వచ్చివెళ్లే వారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో సౌకర్యాలు లేకున్నా అధికారులు ఆ భవనంలో అద్దె చెల్లించాల్సి వస్తోంది..

◆ అద్దె భవనంలో కొనసాగుతున్న మేడ్చల్ డివిజన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇలా సౌకర్యాలు లేని ప్రభుత్వ కార్యాలయాలను మండల పరిషత్ ప్రాంగణంలోకి మారిస్తే ఎలాంటి సమస్యలు లేకుండా వినియోగదారులు అన్ని సౌకర్యాలు పొందవచ్చు.

◆ ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీ ఐతే వృథాగా ఉన్న భవన సముదాయాలను కాపాడంతో పాటు, మిగతా కార్యాయాలకు వసతులు కల్పించవచ్చు. జిల్లా అధికారులు వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం

మేడ్చల్: ఆర్టీసీ డిపో పరిధిలో మార్చిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ప్రగతి చక్రాల పురస్కారాలను అందజేసింది. శుక్రవారం డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎం సుధాకర్ కార్మికులను శాలువాలతో సన్మానించి మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. బ్రేక్‌డౌన్ లేకుండా బస్సులు నడపడం, ఇంధనం పొదుపు, వంటి వాటిలో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలను అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎఫ్ఎంఈ విద్యార్థులకు పర్యావరణం, వాటి పరిరక్షణకై 'ఎకోటెక్' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటమే పర్యావరణ స్థిరత్వమని, మొక్కలు పెంచి, కాలుష్యాన్ని తగ్గించి, ప్రకృతిని రక్షిద్దామని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన భూమి, పరిశుభ్రమైన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, డెమో మోడల్స్ ద్వారా ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తమప్రసాద్, ఎఫ్ఎంఈ హెచ్ఓడీ కిరణ్మయి, కో- ఆర్డినేటర్ శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయితీల్లో అభివృద్ధి పనులపై..

కేశవరం గ్రామాన్ని సందర్శించిన బీహార్ సర్పంచుల బృందం



కేశవరం గ్రామంలో బిహార్ సర్పంచ్‌ల బృందం

శామీర్ పేట: మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామాన్ని శుక్రవారం బిహార్ రాష్ట్ర సర్పంచుల బృందం సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై అవగాహనకై ఎన్ఆర్ఐడిలో భాగంగా 42 మంది బిహార్‌కు చెందిన సర్పంచ్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను తెలుసుకునేందుకు గ్రామపంచాయతీ భవనం, వైకుంఠదామం, పల్లె ప్రకృతివనం, అంగన్‌వాడీ సెంటర్, పీహెచ్‌సీ సబ్‌సెంటర్, గ్రామంలోని సీసీరోడ్లు, గ్రామంలోని అండర్ డ్రైనేజ్ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎస్‌హెచ్‌జీ మహిళలు చేపడుతున్న టైలరింగ్ గురించి తెలుసుకున్నారు. ఆర్థికవనరులు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి సర్పంచుల బృందానికి వివిధ శాఖల అధికారులు వివరించారు. జెడ్పీ సీఈఓ కాంతమ్మ, జిల్లా పంచాయతీ అధికారి సాంబశివరావు, ఎంపీడీఓ గీతారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, ఎంపీవో మంగతాయారు హౌసింగ్ ఏఈ అల్లాజీ, గ్రామపంచాయతీ కార్యదర్శి గౌతమి, ఎస్ఎస్‌జీ మహిళలు, సిబ్బంది గ్రామస్తులు తదితరులున్నారు.

గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని గిరిప్రసాద్‌నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ గిరిజన సమాఖ్య మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో గిరిజన సమాఖ్య మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ హాజరై మాట్లాడుతూ.. సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయంగా జీవనం సాగించే గిరిజనులు సామాజికంగా అడుగులు వేసినప్పుడే అభివృద్ధి చెందుతారని, తమ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేయాలన్నారు. గిరిజనులకు ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా గిరిజన సమాఖ్య నూతన కౌన్సిల్‌ను 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా శ్యామల లత, ప్రధాన కార్యదర్శిగా స్వరూపనాయక్, కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. సాయిలుగౌడ్, తోటపల్లి శంకర్, యాదగిరి, మహేష్, జయమ్మ, సత్యం, ఎల్లయ్య తదితరులున్నారు.

బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కి వచ్చే బాధితులకు వారి సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యేలా కృషిచేయాలన్నారు. ఆధునిక కాలానికి అనుగుణంగా పోలీసులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. కమ్యూనిటీ మీటింగ్‌లు పెడుతూ ప్రజలతో మమేకమవ్వాలన్నారు. సైబర్ క్రైమ్, గంజాయిపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ మహేష్, జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో సైదయ్య, ఇన్‌స్పెక్టర్లు ఇద్రీస్ అలీ, రామునాయక్, నర్సయ్య, వేణుమాధవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రెవెన్యూ సమస్యకు 'భూ భారతి'తో పరిష్కారం

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఘట్‌కేసర్: ప్రతి రెవెన్యూ సమస్యకు 'భూ భారతి' పరిష్కారం చూపుతుందని, ధరణితో ఎదుర్కొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు 2025 నూతన చట్టం ప్రవేశపెట్టి ఏప్రిల్ 14 నుంచి అమలు చేస్తుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మున్సిపాలిటీలోని ఏదులాబాద్ డీఎస్సార్‌గార్డెన్‌లో భూభారతి చట్టంపై శుక్రవారం అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణితో ఎదురైన సమస్యలకు పరిష్కారం భూభారతి ఇస్తుందన్నారు. మే, జూన్ నెలలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు.

శాశ్వత రికార్డు నమోదు..

భూ భారతితో శాశ్వత రికార్డు నమోదవుతుందని, ఆన్‌లైన్‌లో తప్పులు సరిచేసే అవకాశం అధికారులకు ఈ చట్టం ఇచ్చిందన్నారు. పీఓబీ సమస్యలు పరిష్కారించే అధికారం కలెక్టర్‌కు అప్పగించిందన్నారు. సర్వేనంబర్‌లో నమోదైన ఎక్కువ భూమి రికార్డు అయితే నోటీసులు ఇచ్చి తొలగిస్తామన్నారు. వ్యక్తిగత భూ సమస్యలకు సంబంధించిన వాటిపై దరఖాస్తు చేసుకుంటే అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

◆ ధరణిలో రెవెన్యూశాఖకు ఎలాంటి అధికారాలు ఇవ్వనందున అధిక సంఖ్యలో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, నూతన చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు.

◆ పాస్‌బుక్స్ రాని వారికి కొత్తవాటిని ఇవ్వడం, తప్పులను సవరించి రైతుల సమస్యలు తీరుస్తామన్నారు. అధికారిక సర్వేయర్లు ద్వారా సర్వే చేయించి భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాప్‌లను ప్రభుత్వ సర్వేయర్లు సరిచేయించిన తర్వాతే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్‌మ్యాపులు, వస్తాయని, దీనివల్ల ఎవరికీ నష్టం జరగదన్నారు.

◆ భూ భారతి చట్టం ఏటా డిసెంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, చేర్పులను ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసి ప్రతి పంచాయతీ నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారని, దీంతో భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయన్నారు.

బాధ్యత మరింత పెరిగింది..

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన చట్టంతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. నూతన చట్టంలో కొత్త అంశాలను పొందుపరుస్తూ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూభారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తుందన్నారు. ఇళ్ల స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూముల హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయసాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీ ఉపేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, స్థానిక తహసీల్దార్ రజని, జెడ్పీ మాజీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మహేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, ముత్యాలుయాదవ్, రాధాకృష్ణమదిరాజ్, కొండల్‌రెడ్డి, కుమార్‌ముదిరాజ్ పాల్గొన్నారు.